క్లుప్తంగా

ఆలయ స్థలం కబ్జాపై నిఘా వర్గాల ఆరా


కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ స్వామి దేవాలయం భూమి స్థలంపై పెద్దల కన్ను అనే కథనం సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైంది. దాంతో కాశిబుగ్గలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఈక్రమంలో కబ్జా వెనుక ఉన్న వారిపై పోలీసు నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

‘ఆశా’ల సమస్యలు పరిష్కరించాలి



ఎంజీఎం: తమ సమస్యలు పరిష్కరించి, రూ.9,750 వేతనం అందించాలని ఆశ వర్కర్లు కోరారు. ఈమేరకు డీఎంహెచ్ఓ సాంబశివరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు తమ వేతనాల్లో కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైముద, పద్మ, శ్రీలత, రషీద, యాదమ్మ, శారద, అనిత, సుశీల, సల్మా, సునీత, రాజశ్రీ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత కంటి వైద్య శిబిరం



కాజీపేట: కాజీపేట పట్టణంలోని డాక్టర్ విశ్వనాథరావు ఆస్పత్రిలో శాశ్వత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు సోమవారం ప్రారంభించారు. స్థానిక లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ సుస్మిత ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు ఉచిత వైద్య శిబిరాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసి పేదలకు అవసరమైన సేవలను అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్ రావు, డాక్టర్ ఆర్య, డాక్టర్ పీవీ.మల్లికార్జున్ రావు, క్షీరసాగర నరేష్, వెంకటనారాయణ రెడ్డి, దుబ్బ రాము, కమటం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ అభినందనీయం




వరంగల్: ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ నిర్వాహకులు ఎడ్యుకేషన్ కిట్లు అందజేయడం అభినందనీయమని ఏనుమాముల ఎస్సై పోగుల శ్రీకాంత్ ప్రశంసించారు. ఏనుమాములలోని సుందరయ్యనగర్ ప్రభుత్వ పాఠశాలలోని 25మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిల్, నోట్ బుక్స్, కంపాక్సులు, బుక్స్, ప్లేట్లు, పెన్నులతో కూడిన కిట్లను సోమవారం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ కొంగర సుదర్శన్, పీఈటీ అశోక్‌బాబు, ఉపాధ్యాయులు వేణుగోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మెరుగైన భవిష్యత్



కాజీపేట అర్బన్: విద్యతోనే మెరుగైన ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని దీనదయాళ్ నగర్ స్లమ్ ఏరియాలోని బడీడు పిల్లలకు నోట్ పుస్తకాలను కడియం కావ్య అందజేసి మాట్లాడారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేశిరెడ్డి మాధవి. తదితరులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌ల ర్యాలీ



హన్మకొండ చౌరస్తా: టూవీలర్ సృష్టికర్త గాట్లీబ్ డైమ్లర్‌ను స్మరించుకుంటూ ప్రపంచ మెకానిక్‌ల దినోత్సవ సందర్భంగా అలంకార్ టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ములుగురోడ్డు జంక్షన్ నుంచి వేయిస్తంభాల గుడి వరకు సాగిన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు లక్కాకుల రాజు మాట్లాడుతూ 1885, జూలై 3వ తేదీన గాట్లీబ్ డైమ్లర్ అనే జర్మన్ ఇంజనీర్ టూవీలర్‌కు రూపకల్పన చేశారని గుర్తుచేశారు. ర్యాలీలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌస్‌పాషా, కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారులు కర్తాకర్, హసన్‌పాషా, కార్యవర్గ సభ్యులు దుంపేటి రాజు, నజీర్, శ్రీను, రాజు, రంజిత్, ప్రవీణ్, జబ్బార్, ఎస్‌కే.అలీ, సాగర్, సురేష్, మెకానిక్‌లు తదితరులు పాల్గొన్నారు.



యాదవనగర్‌లోని సాయిబాబా ఆలయంలో చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, తదితరులు



షిర్డీ సాయిబాబా మందిరంలో సీపీ రంగనాథ్ దంపతులు



గిర్మాజీపేటలో నగర మేయర్ సుధారాణి, ప్రభాకర్ దంపతులు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమి వేడుకలను నగర వ్యాప్తంగా భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా, నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. - సాక్షి నెట్‌వర్క్



కాజీపేట శ్వేతార్క ఆలయంలో దత్తాత్రేయుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



శివనగర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



మడికొండ: శాకంబరి అలంకరణలో మహంకాళి అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



కాశీ విశ్వేశ్వరాలయ యాగశాలలో చండీహోమం చేస్తున్న భక్తులు



భద్రకాళి దేవాలయం సమీపంలోని సాయిబాబా మందిరంలో క్యూలైన్లలో భక్తులు



మెట్టుగుట్టపై స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న పూజారులు, భక్తులు



హసన్‌పర్తి: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హెచ్ఎం రవికుమార్‌కు అబ్దుల్‌కలాం జాతీయ పురస్కారం

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని పలివేలుపుల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెనిశెట్టి రవికుమార్‌కు ఇగ్నిటెడ్ డ్రీమ్స్ ఆఫ్ యంగ్ మైండ్ (ఐడీవైఎం) జాతీయ పురస్కారాన్ని ఈనెల 2న ముంబైలోని మేయర్ హాల్‌లో ప్రముఖులు అందజేశారు.

నిందితులు సత్ప్రవర్తనతో మెలగాలి

ఖిలా వరంగల్: నిందితులు సత్ప్రవర్తనతో మెలగాలని తహసీల్దార్ ఫణికుమార్ సూచించారు. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న శివనగర్‌కు చెందిన గండికోట రాజు, శాంతినగర్‌కు చెందిన మార్త రాజయ్య, చింతల్ ప్రాంతానికి చెందిన పాశికంటి ప్రసాద్, శాకరాశికుంటకు చెందిన ఎనగందుల లలిత, వెస్ట్‌పోర్ట్‌కు చెందిన పిట్టల ఐలమ్మ, శంభునిపేటకు చెందిన బూర భాగ్యమ్మను తహసీల్దార్ ఎదుట మండల ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఎస్సై సరిత నేతృత్వంలో సోమవారం బైండోవర్ చేశారు.

పేదలకు అండగా సీఎం కేసీఆర్

వరంగల్: రాష్ట్రంలో పేదలకు సీఎం కేసీఆర్ అండగా ఉన్నారని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 3వ డివిజన్ పైడిపల్లిలో నలుగురికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.50 లక్షల విలువగల చెక్కులను ఇంటింటికి వెళ్లి సోమవారం అందజేశారు. అనంతరం ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన 20కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జన్ను షీబారాణి, నాయకులు హరికృష్ణ, కుమార్‌యాదవ్, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ సెంకేశి మల్లికార్జున్ తెలిపారు. శాంతినగర్, కరీమాబాద్ రోడ్డు, రామాలయం, లక్ష్మినగర్ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు, శంభునిపేట, రంగశాయిపేట, తెలంగాణ కాలనీ, సాయినగర్, నాగమయ్య దేవాలయం, పద్మశాలి వీధి, విశ్వనాథకాలనీ, మహంకాళి దేవాలయం, హంస బేకరీ, మై మాస్టర్ స్కూల్, గిరిప్రసాద్ కాలనీ, గణేషనగర్, కుమ్మరివాడ, గొల్లవాడ, జక్కలొద్ది ప్రాంతాల్లో ఉదయం 7నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామన్నపేట, ఎస్‌వీఎన్, పిన్నావారి వీధి, పోపయ్యపేట చమన్, ఇంతేజార్ గంజ్ పోలీసు స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 8నుంచి 10గంటల వరకు, స్టేషన్ రోడ్డు ప్రాంతంలో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, పుప్పాలగుట్ట, చింతల్, మధ్యకోట, తూర్పు కోట, పశ్చిమ కోట, ఆదర్శనగర్ ప్రాంతాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, కాశిబుగ్గ ప్రాంతంలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సీకేఎం కళాశాల, లక్ష్మి టౌన్‌షిప్, వీవర్స్ కాలనీ, దేశాయిపేట ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంట వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు వివరించారు.

అలాగే, హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 4వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, పోస్టల్ కాలనీ, శాంతినగర్, సుబేదారి మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు, దర్గా ఫీడర్‌లోని దర్గా, ఇంద్రానగర్ ప్రాంతాల్లో ఉదయం 7నుంచి 11గంటల వరకు, సాయినగర్ ఫీడర్‌లోని సాయినగర్, కంచరకుంట, ఏసియన్ మాల్ ప్రాంతాల్లో ఉదయం 7నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

పేదలకు నిలువ నీడ కల్పించడంలో విఫలం






హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్ల ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు, గుడిసెవాసులు

కాజీపేట: నిలువ నీడలేని నిరుపేద కుటుంబాలకు ఇంటి నివేశన స్థలం, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకుడు ఉడుత రవిందర్ విమర్శించారు. పేద కుటుంబాల ఇంటి నిర్మాణానికి రూ.15లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బొట్ల చక్రపాణి, వాసుదేవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎం.చుక్కయ్య, ఉప్పలయ్య, రాగుల రమేష్, వీరన్న, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్ ఎదుట

వరంగల్: జిల్లాలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలని, ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు కేటాయించాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక వరంగల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కమిటీ ఆధ్వర్యంలో వేలాది మందితో కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు వచ్చినా పేదలకు సొంత ఇల్లు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు చింతమల్ల రంగయ్య, సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సాగర్, ముక్కెర రామస్వామి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు సమిండ్ల స్వామి, నాయకులు కోరబోయిన కుమారస్వామి, అరూరి కుమార్, బషీర్, బాబు పాల్గొన్నారు.

‘సూపర్’ ఆస్పత్రిలో సేవలు మెరుగుపర్చాలి



కేఎంసీ ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఎంజీఎం: కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని ఫెర్టిలిటీ, న్యూరో విభాగాల్లో సేవలను మెరుగుపర్చాలని గోపాలపూర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శరీర, నేత్ర, అవయవ దాతల ప్రతినిధులు కోరారు. ఈమేరకు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రిలోని పలు విభాగాల్లో సిబ్బంది లేకపోవడంతో గ్రామాల నుంచి వచ్చే రోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో ఔషధాలు అందించకుండా బయటనే కొనుగోలు చేయాలని సూచిస్తున్నారని తెలిపారు. ఆయా విభాగాల్లో వారంలో రెండు, మూడు రోజుల అనే నిబంధనల వల్ల రోగులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి తేరాల యుగేందర్, సీడబ్ల్యూసీ సభ్యులు దామోదర్, రాజేందర్, మల్లారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గురువు రూపంలో పరమశివుడు



సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

వరంగల్: శివానందమూర్తి రూపంలో పరమశివుడు వచ్చి భక్తులకు మార్గదర్శనం చేస్తారని శివనందమూర్తి ముఖ్య శిష్యుడు కందుకూరి రాజశేఖర్ అన్నారు. ములుగు రోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో శివానందమూర్తి రూపాన్ని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో శివానందమూర్తి కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్, రిటైర్డ్ అడిషన్ డీజీపీ తివారి, విజిలెన్స్ కమిషనర్ ఆర్‌కే.నందన్, రిటైర్డ్ ఎస్పీ గోపాలరెడ్డి, సినీ నిర్మాత, నటులు అశోక్‌కుమార్, రాధాకుమారి, రిలయన్స్ ఇండియా సీఈఓ. వేణుగోపాల్, సాయినారాయణ, ఉమాశంకర్, సోమరామయ్య, సదాశివుడు, విజయకుమార్, కళ్యాణ్‌రామ్ పాల్గొన్నారు. భీమిలీలో మహాలక్ష్మి ఆలయం, కుంభాభిషేకంపై రూపొందించిన సావనీర్, రుద్రభాష్యం -1 పుస్తకాలను ఆవిష్కరించారు.

సంక్షిప్తంగా

ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి

ఖిలా వరంగల్: ప్రైవేట్, కార్పొరేటర్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సాగర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

ఆ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి

విద్యారణ్యపురి: అనుమతి లేకుండా హనుమకొండలో ఓ ప్రైవేట్ విద్యాసంస్థ మరో బ్రాంచీతో తరగతులను కొనసాగిస్తోందని ఏఐఎఫ్‌డీఎస్, ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ ఇంటర్నేషనల్ యూనియన్ బాధ్యులు తెలిపారు. ఈమేరకు ఆ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలని డీఈఓ. ఎండీ అబ్దుల్‌హైకి సోమవారం వినతిపత్రం అందజేశారు.

కాజీపేట: అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ కోరారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు.

శాకంబరి దేవిగా అమ్మవార్లు

హన్మకొండ కల్చరల్: నగరంలో పలు అమ్మవారి దేవాలయాల్లో శాకంబరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆషాఢ శుద్ధపౌర్ణమిని పురస్కరించుకుని హనుమకొండలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో, జ్ఞాన సరస్వతిదేవి పీఠంలో, వరంగల్‌లోని ఎంజీఎం ఎదురుగా రాజరాజేశ్వరి దేవాలయంలో సోమవారం సాయంత్రం పౌర్ణమి పూజ చేసి భోజన ప్రసాదాలు అందజేశారు.

లలితమాతకు శాకంబరి ఉత్సవాలు

ఖిలా వరంగల్: ఆషాఢ మాసం, గురుపౌర్ణమి పురస్కరించుకుని వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో లలితాదేవికి సంపూర్ణ శాకంబరి ఉత్సవాలను నిర్వహించారు.

పలువురికి సన్మానం

హన్మకొండ కల్చరల్: తెలంగాణ రాష్ట్ర నియోగి కిరణ సంఘం ఆధ్వర్యంలో, సంఘం అధ్యక్షుడు బండారు రాంప్రసాద్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భద్రకాళి దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రకాళి దేవాలయం ప్రధానార్చకులు భద్రకాళి శేషును సన్మానించారు. అలాగే, ఉమ్మడి వరంగల్ జిల్లాలో జర్నలిజంలో విశేష సేవలందిస్తున్న బ్రాహ్మణ జర్నలిస్టులు పీవీ.మదన్‌మోహన్, బి.రామ్మోహన్‌రావు, రవీందర్‌రావు, చిట్టంపల్లి రవీందర్‌రావు, కాసర్ల వసంత్, కృష్ణమోహన్, రంగనాథ్, సాయిరాం, డీడీ శ్రీనివాస్, సౌమ్యశ్రీనివాస్, ఎల్‌బీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ధర్మేంద్రరావును సన్మానించారు.

కేయూలో ప్రభుత్వ వైద్యులకు సన్మానం

కేయూ క్యాంపస్: గురుపూర్ణిమ, జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీలో ప్రభుత్వ వైద్యులు న్యూరోసర్జన్ బోరగాల రాజమోహన్, ఎంజీఎం ఆర్థోపెడిక్ డాక్టర్ కోడం రామ్మోహన్‌ను డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్, ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య సన్మానించారు.

చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మడికొండ: జూలై 6వ తేదీన హైదరాబాద్ నాంపల్లి మైదానంలో జరగనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈమేరకు గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ రాంపూర్‌లోని అంబేడ్కర్ సెంటర్ వద్ద వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు.

దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని నెలకొల్పాలి

వరంగల్ అర్బన్: తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన కురుమ కులానికి చెందిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఉర్సు బైపాస్ రోడ్డులో అధికారికంగా నెలకొల్పాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. బల్దియా మేయర్ గుండు సుధారాణికి వినతిపత్రం అందజేశారు.

బీసీ ‘ఏ’లో ఇతర కులాల విలీనం తగదు

కాజీపేట: బీసీ ఏ జాబితాలో ముదిరాజ్ కులస్తులతో పాటు మరికొన్ని కులాలను కలపడానికి జరుగుతున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని గంగపుత్ర సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాక ఓం ప్రకాష్ డిమాండ్ చేశారు. కాజీపేట పట్టణంలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

హసన్‌పర్తి: ఈనెల 8న హనుమకొండ జిల్లాలో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ పిలుపునిచ్చారు. 66వ డివిజన్ హసన్‌పర్తిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

టీవీఎస్‌వీ ట్రైసిటీ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్



కేయూ క్యాంపస్: తెలుగు వెలుగు సాహితీ వేదిక (టీవీఎస్‌వీ) వరంగల్ ట్రైసిటీ అధ్యక్షుడిగా కాకతీయ యూనివర్సిటీలో తాత్కాలిక ఉద్యోగి డాక్టర్ పాడిశెట్టి విష్ణువర్ధన్‌ను నియమించారు. ఈమేరకు విష్ణువర్ధన్‌కు సాహితీ వేదిక వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రావు నియామక పత్రం అందించారు.

బీరన్న హుండీ లెక్కింపు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని బీరన్న దేవాలయంలో ఆషాఢమాసం తొలి ఏకాదశి పర్వదినానికి ఏర్పాటు చేసిన హుండీలను ఆలయ ప్రాంగణంలో సోమవారం లెక్కించారు. రూ.65,432 వేల నగదు, 12 తులాల వెండి వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

చెరువు హద్దులు నిర్ధారించాలని వినతి

హసన్‌పర్తి: కబ్జాకు గురవుతున్న గోపాలపురం చెరువుకు హద్దులు నిర్ధారించాలని ప్రజాతంత్ర ఆలోచన వేదిక అధ్యక్షుడు తుపాకుల దశరథం, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు హరిబాబు కోరారు. ఈమేరకు గ్రీవెన్స్‌లో నగర కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

సత్యనారాయణ స్వామి వ్రతాలు

కాశిబుగ్గ: 20వ డివిజన్ కాశిబుగ్గ రంగనాథస్వామి దేవాలయంలో ప్రతీనెలా పౌర్ణమిన సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి తెలిపారు. పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల బహూకరణ

ఖిలా వరంగల్: ఎల్బీనగర్ దేశాయిపేట రోడ్డుకు చెందిన మహ్మద్ ఖాజామోయిన్ అక్తర్, వేణురావు కాలనీకి చెందిన మదూరి రఘురాంకు కుటుంబ సభ్యుల సమక్షంలో వీల్ చైర్లను ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సోమవారం బహూకరించారు.

మృతులకు నివాళి

ఖిలా వరంగల్: హంటర్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన కొలిపాక శ్రీకాంత్ (22), గాయత్రి కాలనీకి చెందిన బొంతు అఖిల్ (22) మృతదేహాలను ఎమ్మెల్యే నరేందర్ సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను వేర్వేరుగా పరామర్శించారు.

కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో 13 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కుటా) నాయకులు డిమాండ్ చేశారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు.

దర్గాలో రైస్ డిపో ప్రారంభం

కాజీపేట రూరల్: 48వ డివిజన్ దర్గా సెంటర్‌లో లెంకలపల్లి రామకృష్ణ యాదవ్ నూతనంగా ఏర్పాటు చేసిన అనుపమ రైస్ డిపోను కాంగ్రెస్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ సోమవారం ప్రారంభించారు.

యువకుడి ఆత్మహత్య

హసన్‌పర్తి: క్రిమిసంహారక మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నగరంలోని ఒకటవ డివిజన్ ముచ్చర్లలో చోటు చేసుకుంది. ఈమేరకు మృతుడి తల్లి అరుణ హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం ముచ్చర్లకు చెందిన ఎల్లిగొండ రాజు (33) ప్రైవేట్ హాస్టల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చి క్రిమిసంహారక మందు తాగాడు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి రాజు మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతున్న కార్మికుడి మృతి

మామునూరు: చేసిన అప్పులు తీర్చలేక, ఈఎంఐలు కట్టలేక మనస్తాపానికి గురైన పారిశుద్ధ్య కార్మికుడు క్రిమిసంహార మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈక్రమంలో ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కొమ్ము గోపాల్ (48) బల్దియాలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మృతుడి కుమారుడు జయపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు.

జర్నలిస్టుల నివేశన స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం

నయీంనగర్: నివేశన స్థలాలకు జర్నలిస్టుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిక్స్ మెన్ కమిటీ తెలిపింది. ఈమేరకు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏకశిల, కాకతీయ హౌసింగ్ సొసైటీల్లో సభ్యులుగా లేని జర్నలిస్టులు ఈనెల 5, 6వ తేదీల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. అలాగే, హౌసింగ్ సొసైటీల జాబితాను 4వ తేదీ సాయంత్రం లోపు అందించాలని సభ్యులు సూచించారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ బీఆర్.లెనిన్, సభ్యులు గడ్డం రాజిరెడ్డి, వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, బి.దయాసాగర్, ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

సామూహిక వన భోజనాలు



వన భోజనాల్లో పరపతి సంఘం సభ్యులు

హసన్‌పర్తి: నగరంలోని టీఎస్జీవోస్ కాలనీ -2 పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆషాఢమాస సామూహిక వన భోజనాలు నిర్వహించారు. భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో స్వామివారిని సోమవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, మున్సిపల్ రిటైర్డ్ కమిషనర్ ఇంద్రసేనారెడ్డి, కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, కొత్తకొండ ఆలయ కమిటీ అధ్యక్షుడు కుమారస్వామి, పరపతి సంఘం అధ్యక్షుడు మధుకర్‌రావు, కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కోశాధికారి బొమ్మెర రమేష్ తదితరులు పాల్గొన్నారు.